


# దీపావళి

## (చిత్తసంశుద్ధి)

శ్రీమాన్ ముడుంబ శ్రీనివాసాచార్యులుగారు

౧

నాకు పండుగు లనిన చాలా సరదా. కేవలము పిండివంటలారగించి క్రొత్తబట్టలు కట్టుకొని షికార్లు చేయవచ్చుననియే కాదు. ఆయాపండువు లేర్పఱచిన మన పెద్దల కోర్కెలు ఫలించేలాగు నడుచుకొందమనియే నా ఊహ.

నిజము దీపావళిపండగరోజు లున్నదనగానే ఆపండుగనుగూర్చిన వివరాలన్ని తెలిసికొని ఆనాటి కార్యక్రమముసంగతి ఆలోచించుకొనుచు ఉటూరుట ఆరంభించినాను. నే నెల్లూరు జాతీయమహావిద్యాలయములో చేరి మూడేండ్లయినదేమో! అప్పటికి నేను చదువుచున్నది ఏడవతరగతి. మాకు నరకచతుర్దశి, అమావాస్యయు సెలవు దినములే. అయినను నేను త్రయోదశినాటిమధ్యాహ్నము కూడ బడిమానివేచి బజారులో దీపావళి విశేషములు చూచుటకు బయలుదేరినాను.

మధ్యాహ్నము మూడుగంటలయినది. నేనుబజారు వెళ్లి చూచితినిగదా, ఏమి చెప్పుదును? కళ్లు చెదరిపోవునట్లన్నికొట్లను బాణసంచులతో నిండియున్నవి. రెండు మూడుగంటల కాలము బజారంతయు తిరిగి తిరిగి విసిగి యొక పెద్దకొట్టుయెదుట క్రొత్తగా ఎత్తబడిన తడకకు నిద్రాడుగానున్న ఒక వెదురుకర్ర నానుకొని చుట్టుపట్టుల చిత్రాలన్నియు జూచుచు నిలుచబడినాను. పోరుగూరి జనముకూడావచ్చి సీమటపాకాయలు, మతాబాలు అగ్గిపెట్టెలు, జపాను కాకరపువ్వు వత్తులు, మతాబా తీగలు మొదలైన వింతవింతవస్తువులుకొని పట్టుకొనిపోవుచున్నారు. అదిఅంతయు తదేకదృష్టితో చూచుచు నిలువబడినానేమో అప్పుడు నా మనస్సులో ఏవో రెండు రకాలఊహలవరుస తోచుటమారంభమైనది. ఒకటిప్రశ్న; ఇంకొకటి జవాబు.

ప్ర—ఈ పాపలుకాల్చుటలు మనదేశమునకు నష్టము కలిగించే ఈ విదేశపు సరుకులు ఎందుకు తెప్పింతురో?

జ—ప్రజ లిటువంటివే విస్తారముగా కొందురు గనుక.

ప్ర—ఎందుచేత కొందురు?

జ—వింతవింత రకాలెన్నో ఉండుటచేత.

ప్ర—గాలిని శుభ్రముచేసే స్వచ్ఛమైన గంధకము, సూరేకారము మొదలైనవానితో చేసిన మన దేశవాళీ సరుకులుమాని ఎందుకుపనికిరాని విదేశపు బాణసంచా కొనడమంత తెలివితక్కువపని మరేమున్నది?

జ—గాలిని బాగుచేయుట కిదొక్కటే మార్గమా ఏమిటి? లక్ష ఉన్నవి. ఏమిటో ? కాల్చిపారవేసేదానికి స్వదేశము విదేశము లేదా యేమిటి? విదేశపుబట్టలు తగులబెట్టినట్లు ఇవీ తగులబెట్టుచున్నాము కాని పెట్టెలలో పెట్టుకొని దాచుకోవడము లేదుకదా?

ఇంతలో మచ్చునకు కాల్చినట్లున్నా డెవడో తాటాకుటపాకాయ, అదివచ్చి సరిగ్గా నాకాళ్లదగ్గఱపడి 'ఢాం' అనిపెద్దధ్వని చేసినది. ఊహాప్రపంచకము పోయి నేను ఉలిక్కిపడినాను. నా అర్థములేని ఆలోచనలు తలుచుకొనగా నాకే నవ్వువచ్చినది. నవ్వాపుకొని నాల్గు వైపులు చూచినాను. రోడ్డుప్రక్క కుఱ్ఱవాడొకడు వెలిగించిన సిసింద్రీ చేతితోపట్టుకొని విడువకే అడ్డదిడ్డ

ముగా త్రిప్పుచు మనుష్యులసంఘును చిత్రముగా తప్పించు కొనుచు కెవ్వున కేకవేయుచు పరుగెత్తిపోవుచున్నాడు. ప్రక్కకొట్టుదగ్గఱ ఎవరో పొడుగుపాటిమనిషి నిల్చుండి మేజాబల్లమీద నీళ్లబాల్చీలో రకరకాల మందుబిళ్లలు వైచి పాములు, బాతులు, పడవలు, పిట్టలు— ఒకటేమిటి— అనేకరూపాలు పుట్టించి చూడవచ్చినవాళ్లందఱిని బొమ్మలవలె నిల్చిపోయేలాగు చేయుచున్నాడు.

నేను మనస్సులో "ఆహా! దీపావళి ఎంతమంచి పండుగ !!" అనుకొన్నాను. రేపువచ్చి తప్పక యిట్టు వంటి చిత్రాలన్ని కొని తీసికొనిపోవలెననుకొనుచు నేను బజారువీథిమళ్లి ఇంటివైపునకు వచ్చుచున్నాను.

అప్పుడే మోతేవారి జ్యూటుమిల్లు ఆరుగంటల కూత కూసినది. నా జతగాడు సత్యనారాయణ కసరత్తు చేసి బడినుండి యింటికిపోవుచు దారిలో నాకెదురుపడి నాడు. మేమీలాగు మాట్లాడినాము.

నేను—ఈవేళ బజారేలాగున్నదనుకొన్నావు? కేవలము కన్నులపైకుంభమే. బాణసంచా కొనుక్కొందుకు— మఱి—మనమెప్పుడు వెళ్లుదము?

సత్య—నేనీయేడు ఏమీకొనను. నేనేకాదు. మనతరగతిలో పిల్లలందఱును బాణసంచా కాల్చడము మాని వేయవలెనని నిశ్చయము చేసికొన్నాము.

నేను—(ఆశ్చర్యముతో) ఇదేమిప్రారబ్ధము! విదేశపు బాణసంచా మానితే మానవచ్చునుకాని—స్వదేశపు వాటికేమి?

సత్య— ఏవీకాల్చకూడదు. మనవాక్యరచనమాస్టరుగారు ఈవేళ ఆపండుగు పుట్టుపూర్వోత్తరాలన్నియు చెప్పినారు. ఇప్పుడు మనమున్నస్థితిలో బాణసంచా కాల్చడము ఎంతబుద్ధితక్కువో మాకు బాగుగా తెలిసినది.

ఆమాట వినగానే నామనస్సు చివుక్కుమన్నది. నిజముగా నాకా మేస్టరుగారిమీద చాలాకోపము వచ్చినది.

నేను—ఆయనమాయలోపడి మానితే మీరు మానండి. నేనుమాత్రము మానను. ఏడాదికొకసారి గాలిని శుభ్రపఱచుటకు మనవాళ్లుపెట్టిన ఈ పండుగమానుటే!! ఎంత తెలివితక్కువ!



సత్య—నాకెందుకు? రేపు ఆకథవింటే నీవే మానుతా నంటావు.

నేను—నేనంత పిచ్చివాడనుకాను.

సత్య—సరే. రేపు మఱల కలుసుకొందము.

అనుచు అతడు తన ఇంటికి పోయినాడు. నాకేదో మాయబెంగవచ్చి పడినది. ఎంతప్రయత్నము చేసినను మనస్సు కుదుటపడలేదు. నడిచి యేలాగో యిల్లుచేరినాను.

రాత్రిసరిగా నిద్రపట్టలేదు. తెల్లవారినది. ఆవేళ నరకచతుర్దశి. "ఈరెండురోజులు ఆ మేస్టరుగారి కంట బడకుండి దీపావళినాడేలాగైన బాణసంచా కాల్చితీర వలెను" అని నిశ్చయముచేసికొన్నాను కాని ఆరోజు సాయంకాలము మాబడిలో స్నేహితులతో బచ్చికాడు కొనుచు ఇట్టే ప్రక్కకు చూచితినిగదా; చేతిబెత్తము నేలనానుకొని నిలువబడి ఆ వాక్యరచన మేస్టరుగారు ప్రత్యక్షమైనారు. నాకుగుండె గుబేలు మన్నది. "నాకెందుకు ఈభయం. ఆయన ఎన్నిచెప్పినను నేను లొంగను. మనస్సు నల్లరాయిగా చేసికొందును" అని నాకు నేనే ధైర్యము చెప్పుకున్నాను. ఇంతలో మా తరగతి దుడుకుకుఱ్ఱవాడొకడు ముందుకువెళ్లి "పంతులుగారూ! నరసింహమూర్తి బాణసంచా కాల్చడము మానడట. హరిహరబ్రహ్మాదులు దిగివచ్చినను నాచేత మాన్పించలేరను చున్నాడండి" అన్నాడు.

"అతనిమాట కేమిగాని రేపు నీవేమి చేయుటకు నిశ్చయించుకొన్నావు?" అన్నారాయన. ఆ పిల్లవాడు "నేనెంతమాత్రము కాల్చను. అసలు మా యింటిలోనికి బాణసంచా అన్నమాటే రానివ్వ" నన్నాడు.

అప్పుడిద్దరుముగ్గురు కుఱ్ఱవాళ్లు ముందుకు వచ్చి "పంతులుగారూ! ఆకథ మళ్లీచెప్పండి! నిన్న మేము విన లేదు. మేముకూడ బాణసంచా కాల్చుట మానివేయు దుము" అన్నారు.

ఉపాధ్యాయులు నావైపుతిరిగి "ఏమి నరసింహమూర్తీ! చెప్పమన్నావా?" అన్నారు.

నాకు ఇష్టములేకపోయినను వెంటనే "చెప్పండి" అనుమాట నానోటినుండి జారివచ్చివేసినది.

"మరీ—ఆటమానివైచి అందఱు చాపమీదకువచ్చి శ్రద్ధగా వినెదరా?" అనుచు ఆయన ఆచార్యాశ్రమము దగ్గఱి సావిడిమీదిచాపపై కూర్చున్నారు. మేమందఱము వెళ్లి చుట్టును కూర్చున్నాము. ఆయన ముందుగా చెప్పిన మాట లివి.

"మీరు నాకు భయపడికాని, తొందరపడి కాని నేను చెప్పినట్లు నడుచుకొందుమని మొగమిచ్చకపు మాటలు చెప్పవద్దు. నిర్భయముగా అడిగి మీకు తోచిన సందేహములన్ని తీర్చుకొని మనస్సు మార్చుకొనవలసియుండిన తప్పక మార్చుకొనుడు. ఎవరే మనుకొన్నను సరే నే నీ తప్పుపని చేయకమాననని చెప్పే మొండివాడు ఎందుకుపనికిరాడు. ఎన్ని ప్రయత్నాలైన చేసి చెడుకోరికలను చెడు అలవాటులను తరిమివైచి మన మనస్సులు బాగుపఱుచుకొనుటకొరకే మనమీ ప్రపంచకమున మనుష్యులముగా పుట్టినామన్న మాట మఱచి పోకుడు."

నే నూరుకోలేదు "ఏమండీ మేష్టరుగారూ; మంచి వని తోచినపనులన్నీ మనము చేయగలమా? చెడ్డవి పూర్తిగ మానివేయగలమా? చదువుకొనే పిల్లలు బ్రహ్మచర్యవ్రతం పూని కారపుతిండ్లుమాని మునులవలె నిష్ఠగా ఉండవలె నన్నారుకదా? ఈకాలములో ఎవరైన ఆలాగున ఉండ గలరా?" అన్నాను.

పంతులుగారు అన్నారు. "అబ్బాయీ! నూతిలో కప్పలాగున అందఱు నీవంటివారే అనుకోకు. ఏకాలములో నైన మంచిచెడ్డ లుండకమానవు. నీవు అహమ్మదాబాదు సబర్మతీ ఆశ్రమమునకును హరిద్వార గురుకులాశ్రమమునకును పోయిచూచినట్లయితే అక్కడ చదువుకొను పిల్లల నిష్ఠకు నీవు చాల ఆశ్చర్యపడెదవు. అట్టి దీక్షగలవా రక్కడ నీకు వందలకొలది కాన్పింతురు. దేవునిదయ ఉన్నట్లైతే పవిత్రచరిత్రులైన మనపాఠశాల ఉపాధ్యాయుల మంచిబోధలవలన మీరును చిత్తసంశుద్ధి పొందినవారై మన మహావిద్యాలయమును ఆంధ్రదేశమునకంతటికిఆదర్శప్రాయంగా ఉండేలాగున చేయగలుగుదురు.

ఈమాటలు వినగానే నా కెంతో సంతోషము వచ్చినది. "ఆలాగున జరిగించుటే మనము జన్మమెత్తినందుకు ఫలము" అనుకొన్నాను. ఉత్సాహముతో తలయూపుచు "చెప్పండి. చెప్పండి. కథ" అన్నాను.

## ౨

పగలు నాలుగుగంటలు కొట్టుచున్నప్పు డాయన కథ ప్రారంభించినారు. కథపూర్తి అగునప్పటికి సాయంత్రము రమారమి 8 గంట లైనది. పిమ్మట ఆ కథకును మనదేశములో ఇప్పుడు జరుగుచున్న గాంధిగారి సహాయ నిరాకరణ కథకును సంబంధము కలిపిచెప్పిన సంగతులు పూర్తియై నేను తెల్లబోయిలేచి ఆకాశ మందుకొనుచున్న ఊహలతో ఇంటికి వెళ్లబోయేసరికి రాత్రి ఎనిమిది దాటి పోయినది.

ఎంత ఆలస్యమైతే నేంగాని నాకుచాలా క్రొత్త సంగతులు తెలిసినవి. దీపావళిపండుగ గుట్టుమట్టులన్ని పూర్తిగా తెలిసిపోయినవి. నాకు తెలిసిన సంగతు లన్నియు మన తెనుగుదేశములో ఉండే పిన్నపెద్ద లందఱికి తెలిసేలాగుచేసి ఈ బాణసంచాపిచ్చి పోగొట్టవలెనని నాకు గట్టిపట్టుదల కలిగినది. ఏ మంచిపనియైన లోకము లో వ్యాపించవలెనంటే మాటలవల్లకంటె, చేతలవల్లనే త్వరగా అవుతుందని మా పంతులుగారి ఉద్దేశ్యము. "ముందు నీవుచేసి, తర్వాత నీస్నేహితులచేత చేయించు. అదేక్రమముగా లోకమెల్ల వ్యాపించు" నని వారిబోధ. వారు చెప్పినది కొంతవరకు నిజమేకాని నాకు తెలిసిన సంగతులన్నియు నావంటిపిల్లవాళ్లకు తెలియజెప్పితే వారు వెంటనే మాబడిపిల్లలవలె చేయుడమునకు సిద్ధపడుదురని నాకొక గట్టినమ్మక మున్నది. అందుచేత నా మనస్సులో బాగుగా నాటుకొనిపోయిన కథలోని ముఖ్యమైన సంగతులు మాత్రము పిల్లలకు తెలిసేలాగు నేనిందు వ్రాయుచున్నాను. మిగిలినవి మీరే ఆలోచించి తెలిసికొండు.

పదునైన పెద్దకోరలు. పొడుగయిన మూతి. బలముగల గిట్టలు. పొట్టితోక. మెడనిండ జూలు. చూడగానే గుండెబ్రద్దలయేలాగు భయంకరమైన అడవిపంది అవతార మెత్తినాడు విష్ణుమూర్తి. ఎత్తిఏమిచేసినాడు? అన్నిలోకాలు గజగజవణకిపోయేలాగు మొదట గట్టిగా ఘుర్ఘురించినాడు. వెంటనే తిన్నగాపోయి హిరణ్యాక్షుని గుండెలలో ఒక్కపోటుపొడిచి పడగొట్టి కోరలతో ఒడలంత చీల్చివైచి గిట్టలతో కుట్టించి ఆ రక్తప్రవాహములో రెండుసార్లుపొర్లి తోకత్రిప్పుకొనుచు ముందుకుపోయి కనబడిన దుష్టరాక్షసుల నందఱిని ఈలాగే

చిత్రవధచేసివచ్చి రూపముపొందిన కోపదేవత లాగు భయంకరాకారముతో నిలువబడినాడు.

హిరణ్యాక్షుడు చాలాదుర్మార్గుడు. తాను చెడిపోవడమే కాకుండ లోకమంతా పాపములో పడిపోయే లాగు చేసినాడు. వానినిచంపి ఆపడిపోయిన భూదేవిని పైకి తేవడానికే విష్ణుమూర్తి ఇంతతామసాకారము తాల్ప వలసివచ్చినది. భూజనులంతా విష్ణుమూర్తి చేసినపనికి చాలా సంతోషించినారు. "దుర్మార్గపు రాక్షసులను చంపి ప్రజలకు సౌఖ్యము కలుగచేయుటకు నీవంటి అద్భుత పరాక్రమముగల రాజునే మాకు దయచేయవలె" అని వాళ్లంతా వెఱ్ఱివాళ్లై హరిని కోరినారు. "నావంటి తామసమూర్తి ప్రాణులను చంపడమునకే కాని ప్రజలను రక్షించడమునకు పనికిరాడు" అన్నాడాయన. వాళ్లు నమ్మలేదు. గట్టిపట్టుపట్టినారు. హరి దయాసముద్రుడు. 'సరే'అని మాయమైపోయినాడు

వెంటనే వాళ్లకోరికకు ఫలముగా నరకుడు పుట్టినాడు. వానిపరాక్రమము చెప్పశక్యముకాదు. పెద్దవాడై పరాక్రమమువల్లనే లోకమునకంతకు చక్రవర్తి అయినాడు. ఎంతబాగుగా పరిపాలించినాడు అనుకొన్నారు? త్రాగుబోతులు, జూదగాళ్లు, దొంగలు, హంతకులు, దాంభికులు, కులద్రోహులు, దేశద్రోహులుకూడా విచ్చలవిడిగా తిరుగుచు నరకుని ప్రాపకమువల్ల హాయిగా బ్రతికేవారు. కాని, ఇంకను ధర్మమేపట్టుకొని ప్రాకులాడుచున్న సత్యకాలపువాళ్లకిమాత్రము కష్టాలు దుఃఖములు తప్పినవికావు. "మనకీ కష్టమెందుకు? నలుగురితోపాటు నారాయణా. మనమూ అధర్మముగానే ఉంటే తీరిపోతుంది" అని మిగిలినవాళ్లుకూడా ఒక్కొక్కరే అధర్మపరులైపోయినారు. అంతా ఒక్కరకమైపోగానే స్వసౌఖ్యంకోసము పోట్లాడుచు కాట్లకుక్కల లాగు చెలరేగినారు ప్రజ. భూలోకమంతా నరకలోకమైపోయినది. నరకుడును ఆయన పరిజనము చేసే దుండగాలు చూచితే ప్రజలందఱికి అసహ్యము వేసినది రాజు ధర్మమూర్తిగా లేనియెడల రాజ్యానికెంతనష్టమో వాళ్లకి బాగుగా నాటిపోయినది. అయితే ఏమిచేయగలరు, మనసార చేసికొన్నపనికి? ఎంతవిచారించితే ఏమి లాభము? అప్పుడు రాజ్యములో వింతవింత మార్పులు కన్న కావలెనన్న అన్నీ ప్రత్యక్షమైనవి.

లోకములో ఉన్న తమాషాయే ఇది. ఒకసారి జరిగిన సంగతులవంటివే మఱలమఱల జరుగుచుండడము స్వభావము. పాశ్చాత్యవ్యామోహము పోగొట్టి మనకందరికి దేశభక్తి కలిగించడమునకిప్పుడు వైశ్యకులములో గాంధిగారు పుట్టినట్లే అప్పుడు ప్రజలలో ఉండే అజ్ఞానము, భయము, చపలత్వము మొదలైనవి పోగొట్టి ప్రజలందరిని ధర్మమందాసక్తిగలవారినిగా చేసి వారిబాధలు పోగొట్టడమునకు శ్రీకృష్ణమూర్తి యాదవకులములో అవతరించినాడు. యాదవులంటే ఇప్పటి మనగొల్లలతో సమానము. ఆకులములో పుట్టినాడుగనుకనే ఆయన సామాన్యజనులకందఱికి తెలిసేలాగున ధర్మబోధ చేయగలిగినాడు. ఆయన ముఖ్యముగా చెప్పినదేమంటే "మంచిపనులన్నీ మీరుచేయండి, ఫలం కలుగునని ఆశతో చేయవద్దు. దేవుడనైన నేను చేయుచున్నానని నాయందుభక్తిచేతనే చేయండి. పనిచేయడమే మీవంతుగాని ఫలముజోలి మీకక్కరలేదు. అది కలిగించేవాడను నేనే. ఆ భారము నాకు వదిలిపెట్టి మీపనిమీద మీరుండండి"

దేశాలన్నీ తిరిగి ఇంకా అనేకఉపన్యాసాలిచ్చినారాయన. "దైవాంశతో పుట్టిన మహానుభావుల మంచి బోధలువిని మనస్సులు మార్చుకోలేని నిర్భాగ్యులను కఠినచిత్తులకు నరకుని పరిపాలనలో కష్టాలు పొందుచు తమ హక్కులన్నీ పోగొట్టుకొనడమే శిక్ష. మీరిప్పటికైనను పశ్చాత్తాపానికివచ్చి "నిజముగా మేము ధర్మమే నమ్మినాము. అధర్మము మాకక్కఱలేదు." అని దైవసాక్షిగ చెప్పగలిగినట్లయితే ఈక్షణమునుండియే నరకుని ఆశ్రయించుట మానివేయండి: మీరంతాను ధర్మమే నమ్ముకొని ఉంటే మీకు మేలుగలుగుతుంది. తుచ్ఛమైనయిహ సుఖముకోసము అమూల్యమైనధర్మమును అమ్ముకోకండి. మిమ్ములను నరకుడు బెదిరించునే కాని చంపలేడు. మీకే నిజంగా ధర్మదీక్షవుంటే అతడుచేసే అపచారాలన్నీ మీ పాలిటి ఉపచారములైపోకమానవు. ఒకవేళ చంపుతాడే అనుకోండి. ఎవరిని చంపుతాడు? మీ ఆత్మలకు చావులేదు కదా! ఈశరీరం పోగొట్టునా? అది పోతే మీకు మరీమంచిది. ఒక్కధర్మముతప్ప ఈ జన్మములో మీరు సంపాదించుకొన్న వేవీ మీతోరావు. ఆధర్మము మీదనే మీ ముందుజన్మముయొక్క సౌఖ్యమంతా ఆధారపడియుండును. కనుక ధర్మముకాపాడుటకోసము ఎంత

కష్టములైన పడుటకు వెనుదీయకూడదు" ఈలాగున ఒక కేమిటి చాలాసంగతులు బోధించినారు.

ఆయన బోధవించే దేశభక్తియనే పవిత్రమైన అగ్ని ప్రజల అంతఃకరణములలో పుట్టి హృదయాలనుండి బయలుదేరి రక్తనాళాలలోదూరి కేశనాళికల గుండా ప్రవహించి శరీరమంతా ఆక్రమించి తృణప్రాయమైన స్వార్థచింతను పూర్తిగా దహించివైచి వారిని అత్యద్భుత స్వార్థత్యాగులుగా మార్చివైచినది.

ఈలాగున ఉంటూండగానే ఒకనాడు నరకుడు అపరాహ్ణం ఎఱుగని చాలామంది స్త్రీలను పురుషులను చంపించి దిక్కులేనిబాలికలను పదహారువేలమందిని తెప్పించి చెఱయందుంచి అనేకవిధాల వారిని బాధించడము మొదలుపెట్టినాడు.

దారుణమైన ఆసంగతిజరిగిన మఱునాడే శ్రీకృష్ణుడు అనేకచోట్ల సభలుచేయించి ప్రజలందఱికి బాగుగా పురి యెక్కించినాడు. ఒకనాడు ఉదయము వారందఱు తీర్థపుప్రజలాగుబయలుదేరి యమునానదికి వెళ్లిపవిత్రమైన ఆనీటిలో స్నానాలుచేసి తూర్పునైపుతిరిగిఅంతాఒక్కసారిగా సూర్యనమస్కారాలుచేయుచు"మేము ఈనాటినుండి మొదలు ఈ నరకునకు ఏవిధమైన సహాయముచేయము. తిండిలేక ప్రాణముపోయిననుసరే, వీనిని ఆశ్రయించుటకు సిద్ధపడము. మమ్ములనెంత ముక్కలుగ కోయుచున్నను సరే అహింసనువీడము. అధర్మమునకు ఒడబడము. ఓ కర్మసాక్షియగు భగవంతుడా! మేమిది తప్పితిమేని రౌడుల నీచండకిరణములచే మమ్ములను మాడ్చివేయుమా!" అని ప్రమాణములుచేసిరి. ఈలాగే పంచభూతములను తలచుచు దృఢప్రతిజ్ఞలు పట్టిరి.

నరకరాజ్యములో ఆనాటికానాడు దైవప్రార్థనలు, హరిభజనలు ఎక్కువైపోవుచున్నవి. కొందఱు దేశభక్తులు అనేకచోట్ల ప్రచారము చేయుచు శ్రీకృష్ణుని దివ్యబోధఅనే అమృతవర్షమును జనులహృదయక్షేత్రములమీద కురిపించివైచుచున్నారు. కొందఱు చాలా నియమముగలవారై నిద్రాహారాలుమాని తపస్సుచేయుచు స్వార్థపరులగు కఠినచిత్తులకు మాగతినముచేతనే పాఠాలు నేర్పుచున్నారు.

నరకుడిదేమిటిరా చిలికిచిలికి గాలివాన అయేలాగున్నది అని ప్రజాశక్తిచూచి చాలాగాబరా పడిపోయినాడు.అయితేనేమి? అతడేమీ ఊరుకోలేదు. సామదానభేదదండాలు పూర్తిగా ఉపయోగించినాడు. కూలిచ్చి కృష్ణునితిట్టించినాడు. స్వార్థపరులు పాపానికి భయపడక శ్రీకృష్ణలీలలన్నిటికి పెడఅర్థాలుతీసి నోటికివచ్చినట్లెల్ల ప్రేలుట మొదలుపెట్టినారు. ఆపాపపుమాటలు వినేవారెవరు? నరకుని ఏకపుత్రుడు భగదత్తుడే తండ్రిపరిపాలనావిధానము నాక్షేపించుచు శ్రీకృష్ణభక్తుడై తుంటరులైనవారి కారులను ఖండించుచు ఎక్కడచూచిన తానేయై ఉపన్యాసాలిచ్చుచున్నాడు.

"శ్రీకృష్ణమూర్తి దైవాంశతోపుట్టిన మహానుభావుడు. దయాసముద్రుడు. కులముకన్న గుణముగొప్పదని చూపుటకు ఆయన యదుకులమున పుట్టినాడు. సంసారములోనుండియు మోహమును గెల్వవచ్చునని చూపుటకు అనేకమంది భార్యలమధ్య నతడు అస్ఖలిత బ్రహ్మచారిగా నుండగలిగినాడు. భక్తియుఞ్చినదతియున్నవాడు. వేదము చదువరాని శూద్రుడైనను దైవసమానుడే అని ఆయన ప్రత్యక్షముగా నిదర్శనము చూపుచున్నాడు."అని భక్తిపరవశుడై సంతోషబాష్పములు రాల్చుచు అతడు చెప్పేసంగతులు కఠినహృదయములను సైతము వెన్నవలె కరగించివైచుచుండెను.

నరకునికి కావలసినన్ని అస్త్రశస్త్రము లున్నవి. కాని, సంక్షోభించిపోయిన పరిపాలనను సాగించుటకివి ఏవీ పనికిరాలేదు. శ్రీకృష్ణుడు దేశస్థితిఅంతా కనిపెట్టుచునే ఉన్నాడు. చాలామందిప్రజలు గర్భదరిద్రులైపోయినారు. తిండి, బట్ట, దీపము, ఇల్లు ఒకటేమిటి అన్నీ కఱవైపోయినవి. ప్రత్యక్షంగా నరకబాధలే అనుభవించుచున్నారు. కాని, ఒక్కరైన నరకుని సహాయముపొంద నిష్టపడలేదు.

భూదేవి దీనావస్థచూచి రుక్మిణీ సత్యభామలు చాలావిచారించినారు. ఒకనాడు సత్యభామ కన్నీళ్లు చీరచెరగుతో ఒత్తుకొంచు శ్రీకృష్ణునిదగ్గఱకువెళ్లి ఏదైనా అవతారమెత్తి మఱల భూమిని రక్షించుమని చాలాసేపు ప్రతిమాలినది.

"ఏఅవతారం అక్కఱలేదు. నరకుడు తన అధర్మముచేత బలమంతయు పోగొట్టుకొని శవమై పోయినాడు.

ఇప్పుడట్టివానిని నీవంటిఆడుదైనను సులభముగాఓడించ గలదు." అని శ్రీకృష్ణుడామెతో వేళాకోళమాడినాడు.

"ఆమాట నిలుపుకొం" డని చెప్పి సత్యభామ యుద్ధానికి సిద్ధపడినది.

"నరకుడు నాచేతిలో చచ్చి మోక్షము పొంద వలెనని చాలా ఉబలాటము పడుచున్నాడు. అందుచేత వాడు నీచేతిలో చావడు" అన్నాడు శ్రీకృష్ణుడు.

దానితో వారిద్దరికీ వాదోపవాదాలు పెరిగి పెద్ద పోట్లాటంతపని జరిగినది. తుదకేలాగైతేనేమి శ్రీకృష్ణుడు గరుడవాహనమెక్కి సత్యభామతో కూడ యుద్ధరంగమునకుపోయి ఆమెచేతనే యుద్ధముచేయించి ఒకసారి నరకునిమూర్ఛ పొందింపజేసి సత్యభామను సంతోషపెట్టినాడు. తరువాత నరకుని తన చక్రాయుధముచేత చంపి అతనికి మోక్షమిప్పించినాడు.

శ్రీకృష్ణ నరకాసురుల యుద్ధము జరుగుచున్నందుచే ప్రజలప్రాణాలు పీమపీమ మంచున్నవి. గుండెలు దడదడ కొట్టుకోవడము మొదలుపెట్టినవి. ఏమో! ఎటుండి ఎటువచ్చునో అని ఎంతధర్మమార్గులైనను సందేహ పడకుండ ఉండలేకపోయినారు. నరకుని పక్షమువారలకు మాత్రము భయము సందేహము లేకపోయినది. ఆడారి అప్పన్నలాగ కొల్లకొంపలలో తిరిగేకుక్కవా డేమిటిలోక భయంకరుడైన శ్రీనరకమహారాజుగారితో యుద్ధముచేసి జయించినా రేమిటని నవ్వి నవ్వలేకొట్టినారు.

మెలుపుకాంతిలాగు వచ్చినది. శ్రీకృష్ణుడు జయించినాడన్న శుభవార్త. ఇంక చెప్పేదేమిటి! "శ్రీకృష్ణునకు జయ్"అనేకేకలకు విధివిరామము లేదు. చిన్నలు పెద్దలు, స్త్రీలు, పురుషులు అనే భేదములేకుండ అంతా ఆడిపోయినారని నమ్మండి. ఒకటిరెండు రోజులవరకు గుళ్లలోఉండే జేగంటలు, బళ్లలో ఉండే బడిగంటలు, ఇళ్లలోఉండే చిరుగంటలు ఖంగుఖంగున మ్రోగిపోయినవి. ఆ ధ్వనులతో భూమి ఆకాశము నిండిపోయినవి. కాని వాళ్లకు గలిగిన ఆసంతోషమునకు ఈధ్వని లేమి లెక్క? ఊరూరను విడువకుండ ఫిరంగులుకూడ మ్రోగించినారు.

గరుడవాహనారూఢుడై సత్యభామతో గూడి శ్రీకృష్ణమూర్తి ఊరిలోనికివచ్చినాడు. అప్పుడు ప్రజలు చేసిన మన్ననలు, పాడినభక్తిగీతాలు, అర్పించిన స్వాగతపత్రములు వర్ణింప శక్యముకాదు. ఆసంతోషసమయములోనే నరకుని కుమారుడును తనభక్తులలో శ్రేష్ఠుడును అగు భగదత్తునకు ప్రజల అనుమతిచొప్పున పట్టాభిషేక మహోత్సవము చేయించి శ్రీకృష్ణుడు సత్యభామతో తన నగరునకువెళ్లిపోయినాడు. భగదత్తుడు దేశభక్తులకు చేయించిన ప్రత్యేకపువిందులు, బహుమానములు, ఊరూర చేయించిన సంతర్పణలు, బీదలకు ఏర్పాటుచేసిన అన్నవస్త్రాదిదానములు మొదలగునవి మీరూహించుకొనవలసినదే.

ప్రజలఆనందానికి పరిమితిలేదు. అందరు తమ తమ గృహములు పెండ్లియిండ్లవలె కలకలలాడు లాగున అలంకరించినారు. ఇన్నాళ్లనుండియు ఉపవాసాలున్న బడలికంతా వడ్డీతోకూడ తీరేలాగున జనులందరు పిండివంటలతో భోజనాలుచేసినారు. పరిమళము వెదచల్లు తాంబూలాలు వేసికొన్నారు. క్రొత్తబట్టలు కట్టినారు. దేహమున సుగంధద్రవ్యాలు పూసుకొన్నారు. వారము దినములవరకు ప్రతివారు ఇండ్లలోను వాకిండ్లలోను లక్షల కొలది దీపములుపెట్టి రకరకాలవెలుగులుగల బాణసంచులు కాల్చి తమ సంతోషము వెలిపుచ్చినారు.

ఆ సంతోషసమయము శాశ్వతముగా జ్ఞాపకముంచుకొని వచ్చే తమ సంతతివారికి పశుబలమును నాశనముచేసే సాధనము తెలియపర్చడమునకే అప్పటి ప్రజలీ దీపావళిపండుగను ప్రతిసంవత్సరము చేయుటనారంభించినారు.

## ౪

ఎంతోకాలమునుండి మఱువక కాపాడుకొనుచు వచ్చిన ఈపండుగయొక్క అంతరార్థము గ్రహించి ఆఫలితమును పొందదగిన మహాభాగ్యము మనకింకను లటస్థింపలేదు. దాదాభాయి, గోక్లే, తిలకు, దాసు, మొదలగు మహానుభావు లెందరో మనకు స్వరాజ్యమును సంపాదించుటకై కావలసినంత ప్రయత్నించి విఫలులై చనిపోయినారు. శ్రీకృష్ణుని అపరావతారము మహాత్మాగాంధిగారు త్వరగా స్వరాజ్యము కలిగించడము కొరకై విసుగు, విశ్రాంతిలేకుండ అనేకబాధలు పడుచున్నారు. ఇప్పుడు మనము నిరాడంబరముగ జీవించుచు స్వరాజ్యసంపాదనకై విడువకుండ కృషిచేయుచు భగవంతుని అను

గ్రహామునకై వేచియున్నాముకదా! ఆకోరినఫలముపొం దినిదే ఆనందమును తెలియజేయు దీపావళి పండుగను ఏమార్పులేకుండ సౌఖ్యవంతమైన పూర్వ యుగములో వలెనే మనమిప్పుడుచేయుటయం దేమైన అర్థమున్నదా?

ప్రతిదినము దేహపరిశ్రమము ముఖ్యమని పెద్దలు చెప్పినారు కదాయని టైఫాయిడ్ జ్వరపీడితుడై నెల దినములనుండి లంకణములు చేయుచున్న రోగి కసరత్తు చేయుటకు సిద్ధపడిన మన మేమందుము? మన మిప్పుడు జయమును సూచించే ఫిరంగులవంటి టపాకాయలును, సౌఖ్యము కలిగినదని వెల్లడించు సంతోషకాంతి ప్రసర ణము తెలియజేసే మతాబులు మొదలైనవియును కాల్చు టము ఎంత సిగ్గులచేటు!! దేవగణము మనలను జూచి యెంతనవ్వును! మన పితృదేవత లెంత పరితపింతురు!

వ్యాధి నిమ్మళించినవా డారోగ్యస్నానముచేయు ట తెగునుకాని తీవ్రమైన వ్యాధిచేత పీడింపబడి మూల్గు చుండే మందభాగ్యునికి ఆరోగ్యస్నాన మెందుకు? మంచ ముపట్టి ప్రక్కకు ఒత్తిగిలలేనిరోగి “ఆహా! నా జబ్బం తయు పోయినది. ఇప్పుడు నేనులేచి పరుగెత్తెద. ఓహో హో! నాకిప్పు డెంతసౌఖ్యముగా నున్నది?” అని రాని నవ్వు నవ్వనంతమాత్రమున అతనిబంధువులు సంతోషింతు రా? మందిచ్చు వైద్యునకు రోగి జీవించుననను ఆశ కలు గునా?

మనకు స్వరాజ్యము వచ్చినప్పుడే మన మెన్ని టపాకాయలుకాల్చినను మనసంతోష మింతను ఎంత యెక్కువగ వెల్లడించినను మంచిదే. పూర్వ మెప్పుడో మనవారికి మంచిపరిపాలన యుండెననని ఇప్పు డెగిరి చంకలు కొట్టుకొనుచు కూర్చుండుటవలన మనకేమి లాభము? వారేలాగు తమఆపదలు అంతరింప జేసికొన్నారో తెలిసి కొని ఆలాగే నడుచుకోవడము మనధర్మము కాదా?” అని ఇంకను ఎన్నో ఉపన్యాసములు చెప్పుచు ఆయన ఈ దీపావళినాడు ప్రస్తుతస్థితిలో టపాకాయలు కాల్చు ట ఎంత తెలివితక్కువో పరమమూర్ఖునికైన తెలిసిపోవు లాగునను కఠినచిత్తుని మనస్సైనను కరిగిపోయి దేశభక్తి అంకురించేలాగునను ఇంకొకగంటసేపు అనేకసంగతులు బోధించి మా అందరి సందేహాలు పోగొట్టినారు. మా మనస్సు లన్నియు పరిశుద్ధి పొందినవి. అప్పుడు ఎవరి యిండ్లకు వారు వెళ్ళిపోయినాము.

ఇంటికిపోవునప్పుడు దారిలో నామనస్సు ఊరు కోలేదు. “ఆహా! మనదేశములో ఈబాణసంచా వ్యస నము ఎంత బలవత్తరముగా నాటుకొనిపోయినది? తుదకు పాకీవాడుకూడవచ్చి “బాబూ! మీగులాపాణ్ణి. మీపిల్లలు కాల్చగా మిగిలిన రెండుటపాకాయ లీలాగపారవేయం డయ్యా, కామందులు!” అని అతిదీనత్వముతో అడిగి పుచ్చుకొని కాల్చి కొండెక్కినంత సంతోషము పొందు చున్నాడే! ఈ పనికిమాలిన టపాకాయలకు ఖర్చుపెట్టే డబ్బంతయు ప్రతివాడు తనవిధి అనుకొని ఆరోజున తిలకుస్వరాజ్యనిధికి ఇచ్చివేసిన ఎంతబాగుండును! ప్రతి సంవత్సరము మనబీదదేశములో ఈ టపాకాయలకోసము ఒకకోటి ఏబదిలక్షల రూపాయలకంటే ఎక్కువఖర్చు అగుచున్నదనిగదా విన్నాను. ఇంతడబ్బు వృథాగా ఖర్చు పెట్టుచున్న దీపావళిపండుగ, స్వరాజ్యముకోసము ఆ డ బ్బంతయు సద్వినియోగము చేయునంత పరమపవిత్రము గా మారిపోయినట్లైతే మఱిసంవత్సరమునకు మనకోరికలు నెరవేరడమున కాశ్చర్య మేమున్నది! మనవారు గట్టి కృషిచేసి యీదీపావళినాడు స్వరాజ్యనిధి జాతీయ విద్యాలయనిధి మొదలైన చందాలు వసూలుచేసి ప్రజల లో కార్యోత్సాహము వృద్ధిపొందించి దీపావళిని అర్థ వంతముగా చేసిన బాగుండును. ప్రస్తుతము బందరు జాతీయకళాశాలవారుమాత్రము ప్రతిసంవత్సరము విడు దల చందాలు వసూలుచేయుచున్నారు. ఏడాదికి ఎని మిదివేలు మొదలు పదివేలవరకు వారికి దొరకుచున్నవట.

దీపావళికి నూటయేబదిలక్షల రూపాయలు దు ర్వ్యయముచేసే మనదేశములో స్వరాజ్య సంపాదనకు ఆవశ్యకమైన జాతీయవిద్యకు పాఠశాల ఒక్కంటికి పది వేల రూపాయల చొప్పున ఒకవేయి పాఠశాలలవారైన చందాలు సంపాదింపలేకపోతే — ఈమాత్రము దేశభక్తి ప్రజలలో పుట్టించడము మనకు చేతగాకపోతే — మనకు స్వరాజ్యము ఏలాగువచ్చును? స్వరాజ్యవాంఛ టపా కాయ సరదాపాటి లేకపోయెగదా మనవాళ్లకు.” అని యేమేమో ఆలోచించుకొనుచు సంతుష్టహృదయముతోనే నేనిల్లుచేరినాను.

ఇంటికిపోయి చూచునప్పటికి మా అన్నయ్య అప్పుడే నాల్గురూపాయల బాణసంచా కొని తెప్పించి

యింట్లో ఉంచినాడు. అదిచూడగానే నేనెంతో సంతోషించెదనని మా అన్నయ్య ఊహ. కాని చిత్తశుద్ధిగాంచిన నా కన్నులకవి మల్లుతాళ్ల మడతలంత నీచముగా కనబడినవి. తొడుగుటకుకూడ నామనస్సు ఒప్పుకోలేదు. మా అన్నయ్యను బ్రతిమాలి ఏలాగైతేనేమి అవి మఱల బజారునకు పట్టించుకొనిపోయి పావలాతక్కువ నాల్గురూపాయలకు అమ్మివేసినాము.

మా అన్నయ్య అందులో రెండురూపాయలు మాత్రము స్వరాజ్యనిధి కివ్వమని నాచేతికిచ్చినాడు. అది అంతా స్వరాజ్యనిధికి యివ్వమని నావాదము. మాఅన్నయ్య ఒప్పుకోలేదు "నీవు బాణసంచా మానిన లాభము కేవలము దేశమునకే కాకుండ నీ యింటి యజమానికి కూడ కొంత గలుగనీయుము. నీకు సంతోషభంగము కలిగించవలెననే ఉద్దేశ్యములేక యింక అనుభోగించుతావనితప్పని సరివచ్చి కొన్నాను కాని తిండికే సరిగా గడువక తంటాలు పడుచున్న మనము ఈపనికిమాలిన బాణసంచాకుకూడ దుర్వ్యయము చేయగలస్థితిలో ఉన్నామా"? అన్నాడు. నేను మఱల మాట్లాడలేదు.

దీపావళినాటి రాత్రి మా రెండు అరుగులమీఁద వంచినూనెతో పన్నెండు ప్రమిద దీపములు మాత్రము పెట్టించినాము. నేనును నామిత్రులు కలిసి కొంతసేపు హరిభజనము చేసినాము. తరువాత శ్రీ యజ్ఞవరాహ మూర్తి పుట్టుకగురించియు నరకాసురవధను గూర్చియు శ్రీమదాంధ్రభాగవతములో ఉన్న కథాభాగములుచదివి మాఉపాధ్యాయులుచెప్పిన విషయములనుబట్టి వాని యంతరార్థములు గ్రహించిసంతోషించినాను.

బాణసంచాలు మానిన ఎంతవిచారము కలుగునో అని నేను మొదట భయపడినాను. కాని నేనవి మాన కలుగునంత మనోనిగ్రహము సంపాదించినందుకే నా కా రాత్రి యెంతో సంతోషము కలిగినది.

మఱునాడు నేనుచేసిన స్వల్పత్యాగమునకు పాఠశాలయందు నాతో చదువుకొను పిల్లలును ముఖ్యముగా మా పంతులుగారును నన్నెంతో మెచ్చుకొని నన్నుగురించి ప్రశంసావాక్యములు పలికినప్పుడు నాకు కలిగిన ఆనందము నేను ఈజన్మములో మఱచిపోలేను. అప్పటినుండియే నాకు నిజమగు చిత్తసంశుద్ధి కలిగినది. మనోదార్ఢ్యమేర్పడినది. ఆచార్య జననీజనకులు చెప్పినట్లువిని వారిని సంతోషపెట్టుటవలన కలుగు ఆనందము వేయిరూపాయల బాణసంచా తగులబెట్టునప్పుడైన కలుగజాలదను సత్యమును నేనారోజుననే గ్రహించినాను. నాజీవితము ధన్యవంతమగుటకు అవకాశమున్నదని నాకప్పటినుండియే, దృఢమైన మనోవిశ్వాసము కలిగినది.

## పారాణి

ఉమర్ అలీషాకవి గారు

మనుఁగుఁదీయవు రావు నాముందు కబల
మేల యడియాసఁ బెట్టె దీలీల బాల
యేనొనర్చినయపరాధ మేమొ చెపుమ
హృదయమును జింపిపెట్టెద నిదిగో కొనుము
వేడిక్రొన్నెత్తురదిగో నీప్రేమగీత
ములఁ బఠించుచు బుసబుసఁ బొంగిపొరలి
వచ్చుచున్నది నీపాద పద్మమంట
వేర పారాణి నీ విఁకఁ బెట్టుకొనకు.